


## హైదరాబాద్ హ్యాట్రిక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు హ్యాట్రిక్ నమోదు చేసుకుంది. మూడు మ్యాచ్‌ల్లోనూ మన జట్టు ఇన్నింగ్స్ తేడాతో గెలుపొందగా.. అన్నీ మ్యాచ్‌లూ రెండు రోజుల్లోనే ముగియడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హైదరాబాద్ ఇన్నింగ్స్ 198 పరుగుల తేడాతో సిక్కింను చిత్తుచేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (103 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), తన్మయ్ (137) సెంచరీలు బాదడంతో హైదరాబాద్ 463/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. సిక్కిం.. రెండో ఇన్నింగ్స్‌లో 186 పరుగులకు కుప్పకూలింది.

## టైటాన్స్‌కు రెండో విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఎట్టకేలకు రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. శనివారం గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 49-32తో యూపీ యోధాస్‌పై అద్భుత విజయం సాధించింది స్టార్ రైడర్ పవన్ షెరావత్(16) టైటాన్స్ విజయంలో కీలకంగా వ్యవహరించాడు. పవన్‌తో పాటు ఓంకార్ పాటిల్(10) రాణించాడు. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 39-33తో యూ ముంబైపై గెలిచింది.

## ఫైనల్లో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్‌లో సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-18, 21-14తో మలేషియా జంట ఆరోన్ చియా,సోహ్ వూపై గెలిచింది. 45 నిమిషాల పాటు సాగిన పోరులో వరుస గేముల్లో భారత జోడీ విజయం సాధించింది. సింగిల్స్ సెమీస్‌లో ప్రణయ్ 15-21, 5-21తో షియు కి చేతిలో ఓడి నిష్క్రమించాడు.

# యువ భారత్ శుభారంభం

- బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- అండర్-19 వరల్డ్‌కప్

బ్లూమ్‌ఫాంటైన్: అండర్-19 ప్రపంచకప్‌లో యువభారత్ శుభారంభం చేసింది. గ్రూప్-'ఎ'లో భాగంగా శనివారం జరిగిన పోరులో యంగ్‌ఇండియా 84 పరుగుల తేడాతో ఆసియా చాంపియన్ బంగ్లాదేశ్‌పై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. ఆదర్శ్‌సింగ్ (76), కెప్టెన్ ఉదయ్ శరణ్ (64) అర్ధశతకాలతో రాణించారు. తెలంగాణ కుర్రాడు అరవెల్లి అవనీశ్‌రావు (23; ఒక ఫోర్, ఒక సిక్సర్) వేగంగా ఆడాడు. అరంగేట్రం మ్యాచ్‌లోనే అవనీశ్ అదుర్స్ అనిపించాడు. బంగ్లా బౌలర్లలో మారూఫ్ 5 వికెట్లు తీశాడు. ఛేదనలో బంగ్లాదేశ్ 167 పరుగులకు ఆలౌటైంది. షిహాబ్ (54) టాప్ స్కోరర్ కాగా.. మన బౌలర్లలో పాండే 4 వికెట్లు తీశాడు. ఆదర్శ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.




# స్వియాటెక్‌కు షాక్

### ప్రపంచ నంబర్‌వన్‌కు చుక్కెదురు • అన్‌సీడెడ్ నోకోవా చేతిలో ఓటమి

అల్కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్

**ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు ఆస్ట్రేలియా ఓపెన్‌లో చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో స్వియాటెక్‌పై అన్‌సీడెడ్ నోకోవా విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కార్లోస్ అల్కరాజ్, జ్వెరెవ్, మెద్వెదెవ్, నోరీ ముందంజ వేయగా.. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు బాలాజీ ద్వయం పరాజయం పాలైంది.**

మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6-3, 3-6, 4-6తో ప్రపంచ 50వ ర్యాంకర్ లిండా నొకోవా చేతిలో ఓడింది. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న స్వియాటెక్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాత్రం అదే జోరు కనబర్చలేకపోతున్నది. మెల్‌బోర్న్‌లో స్వియాటెక్ ఒక్కసారి కూడా సెమీఫైనల్ దాటలేదు. తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టిన 19 ఏండ్ల నొకోవా.. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత అద్భుతంగా పుంజుకొని వరుస సెట్లలో నంబర్‌వన్ ఆట కట్టించింది. రెండున్నర గంటల పాటు సాగిన పోరులో స్వియాటెక్ 4 ఏస్‌లు కొట్టి ఒక డబుల్‌ఫాల్ట్ చేస్తే.. నొకోవా 10 ఏస్‌లు బాదింది. స్వియాటెక్ 34 విన్నర్లు సంధిస్తే.. నొకోవా 35 విన్నర్లు కొట్టి.. 37 అనవసర తప్పిదాలు చేసింది. నొకోవా చాకచక్యంగా నెట్ పాయింట్స్ సాధిస్తూనే.. బ్యాక్ హ్యాండ్ పవర్ గేమ్‌తో వరుసగా 18 మ్యాచ్‌లు నెగ్గిన స్వియాటెక్‌ను మట్టికరిపించింది. ఇతర మ్యాచ్‌ల్లో స్విటోలినా 6-2, 6-3తో గాల్ఫిక్‌పై.. అజరెంక 6-1, 7-5తో ఒస్టపెంకాపై విజయాలు సాధించారు.

### ప్రిక్వార్టర్స్‌లో అల్కరాజ్

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కరాజ్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం మూడో రౌండ్‌లో షాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్కరాజ్ 6-1, 6-1, 1-0తో ఉన్న సమయంలో ప్రత్యర్థి గాయం కారణంగా వాకొవర్ ఇవ్వడంతో ముందంజ వేశాడు. అంతకుముందు జరిగిన రెండు సెట్‌లలోనూ 18 ఏండ్ల అల్కరాజ్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చాడు. ఇతర మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ జ్వెరెవ్ 6-2, 7-6 (7/4), 6-2తో మప్లెసన్‌పై.. మూడోసీడ్ మెద్వెదెవ్ 6-3, 6-4, 6-3తో ఆగర్‌పై.. నోరీ 6-4, 6-7 (7/9), 6-4, 6-3తో రూడ్‌పై.. బొర్గస్ 6-7 (3/7), 6-4, 6-2, 7-6 (8/6)తో దిమిత్రోవ్‌పై విజయాలు సాధించారు. ఆదివారం జరగనున్న ప్రిక్వార్టర్స్‌లో మన్నారినోతో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ తలపడనున్నాడు.

### బాలాజీ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు బాలాజీ పరాజయం పాలయ్యాడు. శనివారం రెండో రౌండ్‌లో బాలాజీ-విక్టర్ (రొమేనియా) జోడీ 3-6, 3-6 తేడాతో మార్సెలో-పావిక్ ద్వయం చేతిలో ఓడింది. చాన్నాళ్ల తర్వాత గ్రాండ్‌స్లామ్ రెండో రౌండ్‌కు చేరిన బాలాజీ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక వెనుకబడిపోయాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో ఇప్పటికే ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టిన రోహన్ బోపన్న.. మిక్స్‌డ్ డబుల్స్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు.




# మాలిక్‌కు మళ్లీ పెండ్లి

- సనా జావెద్‌తో షోయబ్ వివాహం
- టెన్నిస్ స్టార్ సానియాకు విడాకులు

కరాచీ: పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ మాలిక్ ముచ్చటగా మూడోసారి పెండ్లి చేసుకున్నాడు. భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జాతో వివాహ బంధాన్ని తెగదెంపులు చేసుకుంటూ మరో ఇన్నింగ్స్‌కు తెరదీశాడు. పాకిస్థాన్ ప్రముఖ సినీతారగా గుర్తింపు పొందిన సనా జావెద్‌ను శనివారం పెండ్లి చేసుకున్నాడు. సంప్రదాయ పెండ్లి దుస్తుల్లో ఉన్న ఫొటోలను మాలిక్ సోషల్‌మీడియాలో షేర్ చేశాడు. మాలిక్‌కు ఇది మూడో వివాహం కాగా, సనాకు రెండోది. 2010లో ఆయేషా సిద్ధిఖీకి విడాకులు ఇచ్చిన షోయబ్ అదే ఏడాది హైదరాబాదీ సానియాను రెండో పెండ్లి చేసుకున్నాడు. వీరిద్దరికి 2018లో కొడుకు ఇజాన్ పుట్టాడు. అయితే గత కొంత కాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో దూరం దూరంగా ఉంటున్నారు. కొన్ని రోజుల క్రితం షోయబ్..ఇన్‌స్టాగ్రామ్‌లో సానియాను అన్‌ఫాలో చేయడం ఇందుకు మరింత బలాన్ని ఇచ్చింది.



# ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ప్రాధాన్యం

### భారత్, ఇంగ్లండ్ టెస్టుకు ఏర్పాట్లు • హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా ఈ నెల 25నుంచి మొదలయ్యే భారత్, ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. శనివారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మీడియా సమావేశంలో ప్యానెల్ సభ్యులతో కలిసి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడారు. 'ప్యానెల్ ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి టెస్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. టెస్టు జరుగనున్న ఐదు రోజుల పాటు 25వేల మంది విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నాం. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. స్కూల్ ప్రిన్సిపాల్ నుంచి వచ్చిన లెటర్ల ఆధారంగా టికెట్లు కేటాయిస్తున్నాం. విద్యార్థులకు ఉచితంగా భోజనం, మంచినీరు అందిస్తాం. రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది కుటుంబాలకు ఉచితంగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం కల్పిస్తున్నాం. ఇప్పటికే 26వేల టికెట్లు అమ్ముడుపోయాయి. స్టేడియం నలువైపులా పైకప్పు, కొత్త కుర్చీలు, నూతన ఎల్ఈడీ లైట్లతో మైదానం ముస్తాబైంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ సభ్యులు దేవరాజ్, బసవరాజు, దల్జీత్‌సింగ్, శ్రీనివాస్‌రావు, సునీల్ పాల్గొన్నారు.



# రైజా, అనంత్‌కు పారిస్ బెర్త్

కువైట్ సిటీ: ఈ ఏడాది పారిస్ వేదికగా జరుగనున్న ఒలింపిక్స్‌కు భారత్ నుంచి మరో ఇద్దరు షూటర్లు అర్హత సాధించారు. రైజా ధిల్లాన్, అనంత్‌జీత్ సింగ్ విశ్వక్రీడల బెర్త్ దక్కించుకున్నారు. ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్ టోర్నీలో సత్తాచాటి రజత పతకాలు సాధించడం ద్వారా ఈ ఇద్దరు ఒలింపిక్స్ అర్హత మార్క్ అందుకున్నారు. షాట్‌గన్ మహిళల స్కీట్ విభాగంలో రైజా రెండో స్థానంలో నిలువగా.. పురుషుల స్కీట్‌లో అనంత్‌జీత్ తృటిలో స్వర్ణం చేజార్చుకున్నాడు. దీంతో భారత్ నుంచి విశ్వక్రీడల్లో పాల్గొననున్న షూటర్ల సంఖ్య 19కి చేరింది.






హైదరాబాద్‌లో సరికొత్త క్రెటా కారును ఆవిష్కరిస్తున్న నమస్తే తెలంగాణ జీఎం ఎన్ సురేందర్‌రావు, కున్ యునైటెడ్ వైస్ చైర్‌పర్సన్ బీ పూర్ణిమ తదితరులు

# నయా క్రెటా అదుర్స్

### కున్ యునైటెడ్ హ్యుందాయ్ షోరూంలో లాంచ్

తెలుగు యూనివర్సిటీ, జనవరి 20: సరికొత్త ఫీచర్లతో వచ్చిన హ్యుందాయ్ క్రెటా కారును శనివారం సాయంత్రం లకిడికాపూల్ ఏసీగార్డ్స్‌లోగల కున్ యునైటెడ్ హ్యుందాయ్ షోరూంలో లాంచ్ చేశారు. నమస్తే తెలంగాణ దినపత్రిక జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్‌రావు లాంఛనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్ వెర్షన్‌లలో ఈ మాడల్ అందుబాటులో ఉన్నది. 1.5సీసీ ఇంజిన్, వీల్స్, సౌండ్ సిస్టం, స్టీరింగ్, సీటింగ్ ఇలా.. అన్ని విభాగాల్లో కొత్తదనం కనిపిస్తున్నది. ఈ సందర్భంగా జీఎం సురేందర్‌రావు మాట్లాడుతూ.. హ్యుందాయ్ బ్రాండ్‌తో తనకు 15 ఏండ్ల అనుబంధం ఉందన్నారు. వాహనదారుల అభిరుచులకు అనుగుణంగా ఈ కారు ఉన్నదని హర్షం వ్యక్తం చేశారు. అలాగే నమస్తే తెలంగాణ, కున్ యునైటెడ్ భాగస్వామ్యంలో అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. కున్ యునైటెడ్ వైస్ చైర్‌పర్సన్ బీ పూర్ణిమ మాట్లాడుతూ.. మార్కెట్‌కు పరిచయమైన కొత్త క్రెటా మరింత ఆదరణను సొంతం చేసుకోగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఈ క్రెటాను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డీజీఎంలు జీ సంతోష్, కార్తీక్, సేల్స్ మేనేజర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య

# యూనియన్ బ్యాంక్ లాభం 3,590 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 20: ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బకాయిలకోసం నిధుల కేటాయింపులు తగ్గుముఖం పట్టడం, వడ్డీల మీద వచ్చే ఆదాయం పెరగడంతో డిసెంబర్ త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.3,590 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,249 కోట్ల కంటే ఇది 60 శాతం అధికం. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.24,154 కోట్ల నుంచి రూ.29,137 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. గత త్రైమాసికంలో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.20,883 కోట్ల నుంచి రూ.25,363 కోట్లకు చేరుకున్నాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 7.93 శాతం నుంచి 4.83 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 2.14 శాతం నుంచి 1.08 శాతానికి తగ్గాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు రూ.2,443 కోట్ల నుంచి రూ.1,226 కోట్లకు తగ్గాయని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.




# ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయం

ముంబై, జనవరి 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.11,052.60 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.8,792.42 కోట్ల కంటే ఇది 25.7 శాతం అధికం. నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 13.4 శాతం ఎగబాకి రూ.18,678 కోట్లకు చేరుకున్నది. బ్యాంక్‌నకు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం 20 శాతం అధికమై రూ.5,975 కోట్లకు చేరుకున్నాయి. మొండి బకాయిలకోసం బ్యాంక్ నిధుల కేటాయింపులు రూ.2,257.44 కోట్ల నుంచి రూ.1,049.37 కోట్లకు తగ్గాయి.

# ఐస్ప్రౌట్ మరింత విస్తరణ

హైదరాబాద్, జనవరి 20: ఆఫీస్ స్థలాల నిర్వహణ సంస్థ ఐస్ప్రౌట్..హైదరాబాద్‌లో మరో ఆఫీస్‌ను లీజుకు తీసుకున్నది. హైటెక్ సిటీలోని అర ఆర్బిట్ సెంటర్‌లో 2.50 లక్షల చదరపు అడుగుల స్థలంలో కొత్తగా కార్యాలయాన్ని తీర్చిదిద్దింది. 4 వేల మంది కూర్చోవడానికి వీలుండే విధంగా నాలుగు అంతస్తుల భవనంలో ఈ ఆఫీస్ స్థలాన్ని కార్పొరేట్ సంస్థలకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్టు కంపెనీ సీఈవో సుందరి పాటిబండ్ల తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా కంపెనీకి ఉన్న సెంటర్ల సంఖ్య 17కి చేరుకున్నట్లు చెప్పారు. 2017లో తన తొలి సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నూతన సెంటర్ అందుబాటులోకి రావడంతో అదనంగా 2.50 లక్షల చదరపు అడుగుల చేరినట్లు అయినట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో 10, చెన్నైలో రెండు, బెంగళూరులో రెండు, పుణెలో రెండు, విజయవాడలో సెంటర్లను నెలకొల్పింది. వ్యాపార విస్తరణలో భాగంగా ఈ ఏడాది చివరినాటికి ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్‌లకు విస్తరించాలనుకుంటున్నట్లు చెప్పారు.




# ఆరంభ లాభాలు ఆవిరి

### 260 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, జనవరి 20: ప్రత్యేక ట్రేడింగ్‌లోనూ స్టాక్ మార్కెట్లు నష్టపోయాయి. ప్రారంభంలో భారీగా లాభపడ్డ సూచీలు చివర్లో మదుపరులు అమ్మకాలకు పోటెత్తడంతో శనివారం బీఎస్ఈ సెన్సెక్స్ 259.58 పాయింట్లు నష్టపోయి 71,432.65 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో 24 నష్టపోగా..కేవలం ఆరు సూచీలు లాభాల్లో ముగిశాయి. అలాగే నిఫ్టీ 50.60 పాయింట్లు కోల్పోయి 21,571.80 వద్ద స్థిరపడింది. మార్కెట్లో కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్ షేర్లు లాభాల్లో ముగియగా..హెచ్‌యూఎల్, టీసీఎస్, మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగ షేర్లు కుప్పకూలడం వల్లనే సూచీలు నష్టపోయాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. బ్లూచిప్ సంస్థల నిరాశాజనక ఆర్థిక ఫలితాలు పతనానికి ఆజ్యంపోశాయి. మరోవైపు, అయోధ్య రామ మందిరానికి సంబంధించిన పలు కంపెనీ షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోయాయి. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు పక్కా లిమిటెడ్ షేరు 148 శాతం లాభపడగా, కామత్ హోటల్స్ 71 శాతం, ఎస్ఐఎస్ లిమిటెడ్ 18 శాతం, ప్రవేగ్ 35 శాతం, అపోలో సిందూరీ హోటల్ 54 శాతం, థామస్‌కుక్ 18 శాతం, ఐఆర్‌సీటీసీ 17 శాతం, జెనీసిస్ 16 శాతం వరకు లాభపడ్డాయి.








Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.